సాక్షి రంగారెడ్డి

శుక్రవారం । 21 । జూన్ । 2024



యోగాతో ఆరోగ్యం

ఎలాంటి అనారోగ్యానైనా, మానసిక సమస్యనైనా దూరం చేసే శక్తి యోగాకు ఉందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. 8లో▸



అధిక ధరలకు విక్రయిస్తే..

ఫర్టిలైజర్ దుకాణదారులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని వ్యవసాయ శాఖ, టాస్క్‌ఫోర్స్ అధికారులు అన్నారు. 8లో▸



బాధ్యతల స్వీకరణ

శంషాబాద్ డీసీపీగా నియమితులైన బి.రాజేశ్ గురువారం డీసీపీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. 8లో▸

అంగన్‌వాడీ కేంద్రాలకు..
కొత్తరూపు



తులేకలాన్ అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు, తల్లులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ (ఫైల్)

- నూతన సంస్కరణలు తీసుకొచ్చిన కేంద్రం
- ఇకపై ప్రీ ప్రైమరీ బడులుగా మార్పు
- మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట
- పిల్లలకు డ్రెస్‌కోడ్, కొత్త పాఠ్యపుస్తకాలు
- నేటి నుంచి టీచర్లకు శిక్షణ

ఇబ్రహీంపట్నం రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలు కొత్త రూపు సంతరించుకుంటున్నాయి. నిన్న మొన్నటి వరకు అంగన్‌వాడీలు అని పిలిచే పేరు కనుమరుగు కాబోతుంది. ఇక నుంచి ఇవి ప్రీ ప్రైమరీ బడులు కానున్నాయి. కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన కొత్త సంస్కరణలు దేశ వ్యాప్తంగా అమలు చేయాలని కేంద్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. దీంతో అంగన్‌వాడీల రూపురేఖలు పూర్తిగా మారనున్నాయి. ఇప్పటికే అంగన్‌వాడీలు వినూత్న పథకాలతో ముందుకు సాగుతున్నాయి. పౌష్టికాహారం అందించడంతో పాటు చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సేవలందిస్తున్నాయి.

ఈ విద్యా సంవత్సరం నుంచే..

జిల్లాలో 1,600 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వాటిలో వచ్చే చిన్నారులు 20,850 మంది ఉన్నారు. నిత్యం అంగన్‌వాడీ కేంద్రాలకు అంటే ప్రస్తుతం పిలువబడే ప్రీ ప్రైమరీ బడులకు వస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచే వీటిని ప్రారంభించారు. మొదటగా ప్రాథమిక పాఠశాల ఆవరణలో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రాధాన్యత ఇచ్చారు. అన్ని సౌకర్యాలు కల్పించి నమూనాగా తీర్చిదిద్దుతున్నారు. ఇవి సంపూర్ణంగా విజయవంతమైతే బడులకు దూరంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను కూడా మార్చనున్నారు. ఇప్పటికే ఇలాంటి కేంద్రాల్లో టాయిలెట్స్ నిర్మాణం, తాగునీటి వసతి కల్పించడం, విద్యుత్ సరఫరా చేయడం లాంటి పనులు చేపట్టారు.

పిల్లలకు స్కూల్ డ్రెస్సులు

అందరు పిల్లలు ఒకేలా ఉండాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే యూనిఫాం కోసం మెటీరియల్ అందజేసింది. పిల్లలకు డ్రెస్సులు కుట్టే బాధ్యత డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో పని చేస్తున్న మహిళా సంఘాలకు అప్పగించారు. ప్రీప్రైమరీ బడులకు వచ్చే పిల్లలకు ఈ విద్యా సంవత్సరం నుంచి స్కూల్ డ్రెస్సులు ఇవ్వనున్నారు. ఒక్కొక్కరికి ఒక జత ఇవ్వాలని నిర్ణయించారు. దీంతోపాటు సరళమైన పదాలతో అంగన్‌వాడీ పిల్లలకు ప్రత్యేకంగా రూపొందించిన సిలబస్‌తో కూడిన పాఠ్యపుస్తకాలు అందజేయనున్నారు. ఇప్పటికే ఈ పుస్తకాలు అంగన్‌వాడీ ప్రాజెక్టు కేంద్రాలకు చేరుకున్నాయి. పూర్వ ప్రాథమిక విద్య కరదీపిక, ప్రియదర్శిని-1 పేరుతో వీటిని అందించనున్నారు. ఇలా అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయడం ద్వారా పిల్లలకు ప్రాథమిక విద్యను ఇక్కడి నుంచే అందించే ఏర్పాట్లు సాగుతున్నాయి. ఇప్పటికే జిల్లాలో కొన్ని ప్రాజెక్టుల పరిధిలో టీచర్లకు శిక్షణ ఇచ్చారు. మరికొన్ని ప్రాజెక్టుల్లో శిక్షణ నేటితో ప్రారంభం కానుంది. ఇవన్నీ పూర్తయితే అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల సంఖ్య భారీగా పెరగనుంది.



విద్యార్థులకు ఇచ్చే పాఠ్యపుస్తకాలు



అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ ప్రైమరీ బడులుగా మార్చడం బాగుంది. బడులను బలోపేతం చేయడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుంది. ఇబ్రహీంపట్నం

ఆసక్తి పెరుగుతుంది

ప్రాజెక్టు పరిధిలో 72 అంగన్‌వాడీ కేంద్రాల్లో 1,981 మంది పిల్లలకు లబ్ధి చేకూరనుంది. పోషకాహారంతో పాటు చదువుపై ఆసక్తి పెరగనుంది.

– శాంతిశ్రీ, సీడీపీఓ ఇబ్రహీంపట్నం

న్యూస్‌రీల్

పిల్లలు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి



విద్యార్థులకు మాత్రలు అందిస్తున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల: పిల్లలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, అనారోగ్యానికి గురైనప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించాలని చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి సూచించారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా గురువారం ఊరెళ్ల గ్రామంలోని మహాత్మా జ్యోతిరావుఫూలే బీసీ హాస్టల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి హాజరయ్యారు. విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. పిల్లలు అనారోగ్యం బారిన పడకుండా ప్రతి సంవత్సరం కేంద్ర ప్రభుత్వం రెండు విడతలుగా అల్బెండజోల్ మాత్రలను ఉచితంగా పంపిణీ చేస్తోందని తెలిపారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కడుపులో ఉన్న నులిపురుగులను ప్రారంభ దశలోనే గుర్తించి, సరైన చికిత్స తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, జిల్లా ఉప వైద్యాధికారి దామోదర్, ఎంపీపీ విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీలు నెరవేర్చాలి

మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి



కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశ మందిరంలో గురువారం మహేశ్వరం మండలం, తుక్కుగూడ మున్సిపాలిటీలకు చెందిన 148 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం కింద చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల్లో భాగంగా ప్రతి మహిళకూ నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం అందించాలన్నారు. కొత్తగా వివాహమైన ప్రతి పేదింటి కుటుంబాలు, మహిళలు తులం బంగారం, లక్ష ఆర్థిక సహాయం కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీపీ సునీతా నాయక్, పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండు యాదవ్, వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, తుక్కుగూడ మున్సిపల్ వైస్ చైర్మన్ భవానీ వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీఓ శైలజ, డిప్యూటీ తహసీల్దార్ నవత తదితరులు పాల్గొన్నారు.

‘నీట్’ నిర్వహణ తీరుపై ఆగ్రహం



కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

షాద్‌నగర్‌రూరల్: నీట్ పరీక్ష పేపర్ లీకేజీకి బాధ్యులైన వారిపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాజు డిమాండ్ చేశారు. నీట్ పరీక్షను రద్దు చేయాలని కోరుతూ గురువారం సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలోని ముఖ్యకూడలిలో కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై తక్షణమే ప్రధాని మోదీ స్పందించి నిందితులపై చర్యలు తీసుకోవాలని, పరీక్షను రద్దుచేసి మళ్లీ నిర్వహించాలని అన్నారు. విద్యార్థుల జీవితాలతో, దేశ భవిష్యత్‌తో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. దేశంలోని బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే పేపర్ లీకేజీ కావడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీనునాయక్, ఈశ్వర్‌నాయక్, పద్మారెడ్డి, రాజశేఖర్, మహ్మద్, బాబు, భుజంగరెడ్డి, శేఖర్‌గౌడ్, సంతోష తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తిలో ‘స్కిల్ డెవలప్‌మెంట్’

- యూనివర్సిటీ ఏర్పాటు చేస్తాం
- కల్వకుర్తిని విద్యాహబ్‌గా మారుస్తాం
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



అన్మాస్‌పల్లి సమీపంలో వర్సిటీ ఏర్పాటు కోసం స్థలం పరిశీలించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో అంతర్జాతీయ ప్రమాణాలతో దాదాపు వంద ఎకరాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ (వృత్తి నైపుణ్య విశ్వవిద్యాలయం) ఏర్పాటు చేయనున్నట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి వెల్లడించారు. నియోజకవర్గాన్ని విద్యాహబ్‌గా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఆమనగల్లు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజక వర్గంలో స్కిల్‌డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి అంగీకరించారని తెలిపారు. యూనివర్సిటీ ఏర్పాటు కోసం అవసరమైన వంద ఎకరాల స్థలాన్ని గుర్తిస్తున్నట్లు చెప్పారు. 20 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేసి అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలను ఒకేచోట ఏర్పాటు చేస్తామన్నారు. ఆమనగల్లుకు మంజూరైన పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు కోసం అనువైన 5 ఎకరాల స్థలాన్ని సేకరిస్తామని తెలిపారు. ఆమనగల్లులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన అసంపూర్తి పనులను వీలైనంత త్వరగా పూర్తిచేసి వినియోగంలోకి తెస్తామని, అదే ఆవరణలో డిగ్రీ కళాశాల భవనం నిర్మిస్తామన్నారు. సమావేశంలో వివిధ మండలాల తహసీల్దార్‌లు లలిత, ముంతాజ్, రంగారెడ్డి, సుదీర్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

స్థలాల పరిశీలన

స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ కోసం కడ్తాల మండలం అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలో సర్వే నెంబర్ 321, 260లో ఉన్న ప్రభుత్వ భూములను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కల్వకుర్తి ఆర్డీఓ శ్రీనుతో కలిసి పరిశీలించారు. అన్మాస్‌పల్లి సమీపంలోని ప్రభుత్వ భూములను వెంటనే సర్వే చేయించి నివేదిక అందించాలని తహసీల్దార్ ముంతాజ్‌కు సూచించారు. కార్యక్రమంలో కడ్తాల్ ఎంపీటీసీ గూడూరి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిచ్యానాయక్, నాయకులు గూడూరి భాస్కర్‌రెడ్డి, జహంగీర్ అలీ, హన్మానాయక్, రమేశ్, ప్రభు, శరత్ తదితరులు పాల్గొన్నారు.

ఓఆర్ఆర్ అవతల మహానగరం!

దృష్టి సారించిన రేవంత్ సర్కార్



యాచారం మండలం కుర్మిద్దలో ఫార్మాసిటీకి సేకరించిన భూమి

- ఫార్మా భూముల్లో మల్టిపుల్ కాంప్లెక్స్, టౌన్‌షిప్‌ల నిర్మాణం
- ముందుకొచ్చిన జపాన్ కంపెనీ
- త్వరలో వివరాలు వెల్లడించే అవకాశం

యాచారం: ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లో మహానగరాన్ని నిర్మించేందుకు సర్కార్ నిర్ణయించింది. ఔటర్‌రింగ్‌రోడ్డు లోపల హైదరాబాద్ నగరం చుట్టూ పలు పేరొందిన కంపెనీలు, విద్య, వైద్య సంస్థలతో తీవ్ర రద్దీ నెలకొంది. ఈ నేపథ్యంలో ఔటర్‌రింగ్ రోడ్డు అవతల త్వరలో నిర్మించబోయే ట్రిపుల్‌ఆర్ మధ్యలో ఫార్మాసిటీకి సేకరించిన 13 వేల ఎకరాల్లో అన్ని వసతులతో కూడిన మహానగరాన్ని నిర్మించేందుకు సర్కార్ ప్రత్యేకంగా దృష్టి సారించింది. సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సూచనల మేరకే రెండు రోజుల క్రితం ధరణి కమిటీ సభ్యుడు ముదిరెడ్డి కోదండరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్ ఫార్మాసిటీకి సేకరించిన భూములను పరిశీలించారు. నివేదికను మంత్రి శ్రీధర్‌బాబుకు అందజేశారు.

రూ. 40 వేల కోట్లతో..

ఔటర్‌రింగ్ రోడ్డు అవతల ఫార్మాసిటీకి సేకరించిన 13 వేల ఎకరాల్లో రూ.40 వేల కోట్ల పెట్టుబడులతో 3 నుంచి 5 వేల ఎకరాల్లో మల్టిపుల్ కాంప్లెక్స్, విద్య, వైద్య రంగాల హబ్స్, టౌన్‌షిప్‌లను నిర్మించడంతో పాటు వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా జపాన్ కంపెనీ ముందుకు వచ్చింది. ఇప్పటికే కంపెనీ ప్రతినిధులకు ఫార్మాసిటీకి సేకరించిన భూముల వివరాలను సర్కార్ పెద్దలు అందజేశారు. హైదరాబాద్ నగర స్థాయికి మించి ఔటర్‌రింగ్ రోడ్డు అవతల ఫార్మాసిటీకి సేకరించిన నాలుగైదు వేల ఎకరాల భూముల్లో మహానగరాన్ని నిర్మిస్తే రంగారెడ్డి, నల్లగొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ తదితర జిల్లాల ప్రజలకు అనువుగా ఉంటుందని సర్కార్ యోచిస్తోంది. మహానగరం నిర్మాణంతో అక్కడి వరకు మెట్రో రైలు మార్గం, సరిపడా నీటి వనరుల కోసం మిషన్ భగీరథతో పాటు నాగార్జునసాగర్ నుంచి ప్రత్యేక కృష్ణాజలాలు, అవసరమైతే గోదావరి జలాలను సైతం తరలించే విధంగా దృష్టి పెట్టింది. ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లోంచే నూతన రైలు మార్గం కోసం భూ సర్వే చేశారు. నూతనంగా నిర్మించే మహానగరానికి సమీపంలో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం కూడా ఉండడంతో పారిశ్రామికవేత్తలు దేశ, విదేశాల నుంచి సకాలంలో వచ్చి వెళ్లే అవకాశం ఉంటుంది.

గిరిజనుల సమస్యలు పరిష్కరించండి

కలెక్టరేట్ ఎదుట సేవాలాల్ సేన ధర్నా



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న సేవాలాల్ సేన నాయకులు

కడ్తాల్: రాష్ట్రంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సేవాలాల్ సేన రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు రఘురాంరాథోడ్, జిల్లా అధ్యక్షుడు వాక్డోవత్ నరేశ్‌నాయక్ డిమాండ్ చేశారు. గిరిజనుల డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ సేవాలాల్ సేన రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపుమేరకు, గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గిరిజనుల పది శాతం రిజర్వేషన్ పెంపునకు సంబంధించిన జీవో నంబర్ 3కి ప్రభుత్వం వెంటనే చట్టబద్ధత కల్పించాలని, గిరిజనులకు ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలని, నూతనంగా ఏర్పడిన గిరిజన పంచాయతీలను రెవెన్యూ పంచాయతీలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. మంత్రివర్గంలో గిరిజనులకు స్థానం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన స్టేట్ కోకన్వీనర్ భీమ్‌లాల్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజునాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు కిషన్‌నాయక్, కందుకూర్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రవినాయక్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు బలరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే.. కత్తితో పొడిచి..

- బంగారు ఆభరణాల దుకాణంలో దోపిడీకి యత్నం
- షాపు యజమానుల చాకచక్యంతో దొంగల పరార్

మేడ్చల్‌రూరల్: ఒకరు బుర్ఖా.. మరొకరు హెల్మెట్ ధరించిన దుండగులు పట్టపగలే జ్యువెలరీ షాపులో దోపిడీకి యత్నించారు. దుకాణ యజమానిపై కత్తితో దాడి చేసి బంగారు ఆభరణాలు, నగదు ఇవ్వాలని డిమాండ్ చేశారు. యజమాని చాకచక్యంగా వ్యవహరించడంతో పలాయనం చిత్తగించిన ఘటన గురువారం మేడ్చల్ పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు, జ్యువెలరీ షాపు యజమాని కథనం ప్రకారం.. మేడ్చల్ పట్టణంలో 44వ జాతీయ రహదారి పక్కన మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో జగదాంబ జ్యువెలరీ దుకాణం ఉంది. గురువారం మధ్యాహ్నం 1.45 గంటల సమయంలో బైక్‌పై ఇద్దరు దుండగులు (వెనుక కూర్చున్న వ్యక్తి బుర్ఖా.. మరొకరు ముఖానికి హెల్మెట్ ధరించి ఉన్నారు) వచ్చారు. షాపు యజమాని శేషురాం చౌదరిపై బుర్ఖా ధరించిన దుండగుడు కత్తితో దాడి చేశాడు. ఆభరణాలు, నగదు తన వద్ద ఉన్న కవర్‌లో వేయాలని బెదిరించాడు. అరవొద్దని హిందీలో బెదిరించాడు. దీంతో పక్కనే ఉన్న శేషురాం చౌదరి కుమారుడు సురేశ్ షాపు వెనుక గదిలోకి పరుగులు తీశాడు. హెల్మెట్ ధరించిన దుండగుడు షాపులోని వెండి ఆభరణాలు తీసుకుని బుర్ఖా ధరించిన వ్యక్తికి కవర్ పట్టుకో అందులో వేస్తానని చెప్పాడు. వెంటనే అప్రమత్తమైన శేషురాం చౌదరి చాకచాక్యంగా వ్యవహరించి.. హెల్మెట్ ధరించిన వ్యక్తిని తోసి బయటికి వచ్చి చోర్ చోర్ అంటూ అరవసాగాడు. దీంతో దుండగులు పరారయ్యేందుకు బయటికి వస్తుండగా కొంత మేర దోచుకున్న ఆభరణాల కవర్ కిందపడింది. దానిని అక్కడే వదిలిపెట్టి బైక్ ఎక్కారు. అప్పటికే గది లోపలి నుంచి బయటికి వచ్చిన సురేశ్ షాపులోని కుర్చీని దుండగులపై విసిరి వారిని నిలువరించేందుకు యత్నించడంతో పరారయ్యారు. దుండగుల దాడిలో గాయపడిన శేషురాం చౌదరిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

సీసీ కెమెరాల్లో నిక్షిప్తం..

దుండగులు దోపిడీకి యత్నించిన జ్యువెలరీ షాపులో, బయట సీసీ కెమెరాలున్నాయి. దోపిడీ చేసిన తీరు సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైంది. బైక్‌పై వచ్చి లోపలికి ప్రవేశించడం, షాపు యజమానిపై దాడి, బెదిరింపులకు దిగిన తీరు నమోదు కావడంతో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



ఇలా వచ్చి..



అలా వెళ్లి..

ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు

మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న జ్యువెలరీ షాప్‌లో మిట్టమధ్యాహ్నం దుండగులు రెచ్చిపోవడం చర్చనీయాంశంగా మారింది. ఇక్కడి పరిసరాలపై అవగాహన ఉన్న వారే దోపిడీకి స్కెచ్ వేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ఘటన జరిగిన షాపును మేడ్చల్ జోన్ అడిషనల్ డీసీపీ నర్సింహారెడ్డి, మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ సత్యనారాయణ పరిశీలించారు. సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలను పరిశీలించారు. దుండగులు ఉత్తరాదికి చెందిన వారిగా అనుమానిస్తున్నట్లు అడిషనల్ డీసీపీ నర్సింహారెడ్డి తెలిపారు. దుండగులు పరారవుతుండగా గమనించిన ఓ వ్యక్తి బైక్‌పై కండ్లకోయ వరకు ఫాలో అయ్యాడని, బైక్ నంబర్, ఇతర ఆధారాలు సేకరించినట్లు, నిందితుల కోసం గాలింపు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు.

టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శిగా శ్రీకాంత్‌రెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శిగా కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఖమ్మంలో జరిగిన రాష్ట్ర మహాసభల్లో నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు.ఇందులో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న శ్రీకాంత్‌రెడ్డికి రాష్ట్ర కార్యవర్గంలో కీలక పదవీ లభించింది. 22 ఏళ్లుగా జర్నలిస్టుగా జిల్లాలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించిన ఆయన కొన్నేళ్లుగా జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.ఆ సమయంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో సేవలు అందించి జిల్లాకు మంచి పేరు తెచ్చుకోవాలని జర్నలిస్టులు ఆకాంక్షిస్తున్నారు.

బాధ్యతలు స్వీకరించిన శంషాబాద్ డీసీపీ



శంషాబాద్ డీసీపీ బి.రాజేశ్‌కు మొక్క అందజేస్తున్న ఆర్‌జీఐఏ సీఐ బాలరాజు

శంషాబాద్ : శంషాబాద్ డీసీపీగా నియమితులైన బి.రాజేశ్ గురువారం డీసీపీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇంటెలిజెన్స్ బ్యూరో ఎస్పీగా పనిచేసిన ఆయన ఇక్కడికి బదిలీ అయ్యారు. ఇక్కడ డీసీపీగా పనిచేసిన నారాయణరెడ్డి బదిలీపై వికారాబాద్ ఎస్పీగా వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన డీసీపీకి ఆర్‌జీఐఏ సీఐ బాలరాజు మొక్కను అందజేసి స్వాగతం పలికారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ఎలాంటి అనారోగ్యానైనా, మానసిక సమస్యనైనా దూరం చేసే శక్తి యోగాకు ఉందనడంలో అతిశయోక్తి లేదు. నిత్యం యోగాభ్యాసం చేస్తే మనిషికి రోగ నిరోధక శక్తి మెరుగవుతుందని పలు అధ్యాయనాలు వెల్లడించాయి. అంతటి ప్రాధాన్యం ఉన్న యోగా సాధనను అందరూ ఆచరించాలని ప్రభుత్వాలు విజ్ఞప్తి చేస్తున్నాయి.

- నిత్య సాధనతో రోగ నిరోధక శక్తి పెరుగుదల
- నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం



యోగా సాధన చేస్తున్న ఓ పాఠశాల విద్యార్థులు



హుడాకాంప్లెక్స్: ప్రపంచ వ్యాప్తంగా యోగాకు విశేష గుర్తింపు ఉంది. ఏటా జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. దీనికి 2014 సెప్టెంబరు 27న భారత ప్రధానిగా నరేంద్రమోదీ ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరిపేందుకు ప్రతిపాదన చేశారు. 193 ఐక్యరాజ్య సమితి ప్రతినిధుల్లో 175 మంది మద్దతిచ్చారు. భద్రతా మండలిలో శాశ్వత సభ్యులుగా ఉన్న అమెరికా, ఇంగ్లాండ్, చైనా, ఫ్రాన్స్, రష్యా వంటి దేశాలు సహా ఈ తీర్మానంపై విస్తృతమైన చర్చల తరువాత 2014 డిసెంబరులో ఆమోదించాయి. దీంతో 2015 జూన్ 21న మొదటి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా నిర్వహించుకున్నారు.

ప్రత్యేకమైన రోజు

జూన్ 21న ఉత్తరార్ధగోళంలో అత్యధిక పగటి సమయం ఉంటుంది. కనుక ఆరోజుకు ప్రపంచంలోనే పలు ప్రాంతాల్లో ఆయా ప్రత్యేకతలు కూడా ఉన్నాయి. ఎక్కువ పగటి సమయం ఉన్న రోజుగా గుర్తింపు పొందడంతో అదే రోజును అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకోవాలని ఐక్యరాజ్య సమితికి ప్రధాని మోదీ సూచించారు. యోగా అనేది ఒత్తిడిని తగ్గించడంలో, శారీరక బలాన్ని పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తుందని, శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతారు. యోగా అనేది ఓ దివ్య ఔషధమని గుర్తుంచుకోవాలి. క్రమం తప్పకుండా యోగా చేస్తే మనసుకు ప్రశాంతత లభిస్తుంది.

యోగా సాధనతో ప్రయోజనాలు:

- శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతాం.
- శ్వాసక్రియలో ఇబ్బందులు తొలగిపోతాయి.
- తలనొప్పి, పార్శ్వపునొప్పి, మైగ్రేన్ తగ్గుతాయి.
- జీర్ణ సమస్యలు సమసిపోతాయి.
- మెడనొప్పి, వెన్నునొప్పి లాంటి సమస్యలూ దూరమవుతాయి.
- ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతుంది.
- ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ అలవడుతాయి.
- బరువు తగ్గి రోగ నిరోధకశక్తి పెరుగుతుంది.
- వృద్ధాప్యఛాయలు తగ్గే అవకాశం ఉంటుంది.
- నిద్రలేమి, శారీరక, మానసిక సమస్యలు తగ్గి ప్రశాంత జీవనానికి తోడ్పడుతుంది.

నేడు యోగాపై అవగాహన

బడంగ్‌పేట్: ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని యోగా గురువు ఇస్మాయిల్ తెలిపారు. అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్, జాగృతి అభ్యుదయ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 6 గంటలకు కర్మన్‌ఘాట్‌లోని లక్ష్మి కన్వెన్షన్ హాలులో కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

వేదకాలం నుంచి..

వేదకాలం నుంచి యోగా ఉంది. శారీరక, మానసిక ఆరో గ్యం అందిస్తుంది. యోగాలో ఉచిత శిక్షణ ఇస్తున్నాం. ప్రాణాయామంతో మానసిక శుద్ధి జరుగుతుంది. ప్రతిఒక్కరూ యోగా చేస్తే ఉత్తమం. ఆరోగ్య ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని మొలకలు, డ్రైఫ్రూట్స్, కషాయాలను అందిస్తున్నాం.

– ఇస్మాయిల్, యోగా శిక్షకుడు

ఆరేళ్ల బాలుడి కిడ్నాప్

గంటల వ్యవధిలో తల్లి చెంతకు చేర్చిన పోలీసులు



సాయి (ఫైల్)

పహాడీషరీఫ్: అల్లారు ముద్దుగా చూసుకుంటున్న తన కుమారుడి జాడ లేక ఆ మాతృమూర్తి తల్లడిల్లింది. ఉబికి వస్తున్న దుఃఖాన్ని దిగమింగుకొని పోలీసులను ఆశ్రయించింది. కిడ్నాప్‌నకు గురైన ఆరేళ్ల బాలుడిని పహాడీషరీఫ్ పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి గంటల వ్యవధిలోనే క్షేమంగా తల్లి చెంతకు చేర్చారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జల్‌పల్లి శ్రీరాం కాలనీకి చెందిన ఏదుల తిరుపతమ్మకు సాయికుమార్‌తో తొమ్మిదేళ్ల క్రితం వివాహం జరగగా ఇద్దరు పిల్లలు సంతానం. కొన్నాళ్ల క్రితం భర్తతో విడిపోయిన ఆమె ఇద్దరు పిల్లల బాగోగులు చూసుకుంటూ ఒంటరిగానే నివాసం ఉంటుంది. ఇదిలా ఉండగా ఈ నెల 19న సాయంత్రం ఇంటి ముందు ఆడుకుంటూ ఆమె కుమారుడు సాయి అలియాస్ చిన్ను(6) కనిపించకుండా పోయాడు. కాసేపటికి గమనించిన ఆమె ఆచూకీ కోసం సాధ్యమైన అన్ని ప్రాంతాలలో వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో అర్ధరాత్రి 12.30 గంటలకు పోలీస్‌స్టేషన్‌లో బాలుడి కిడ్నాప్‌నకు గురయ్యాడని అనుమానంతో ఫిర్యాదు చేసింది. వెంటనే స్పందించిన ఇన్‌స్పెక్టర్ ప్రత్యేక బృందాలతో సాంకేతిక ఆధారాలతో గాలింపు చేపట్టారు. గురువారం జల్‌పల్లి పరిసరాలలో అపస్మారక స్థితిలో పడి ఉన్న బాలుడిని గుర్తించిన పోలీసులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అనంతరం తల్లికి అప్పగించారు. దగ్గరి బంధువులే కిడ్నాప్‌నకు పాల్పడినట్లు విశ్వసనీయంగా తెలిసింది. నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు, కిడ్నాప్‌నకు గల కారణాలపై విచారణ చేపట్టారు. పూర్తి వివరాలు శుక్రవారం వెల్లడిస్తామని తెలిపారు.

లెక్చరర్‌పై చర్యలు తీసుకోవాలి

ఎస్ఎఫ్ఐ నియోజకవర్గ అధ్యక్షుడు నందకిషోర్

ఇబ్రహీంపట్నం: బీటెక్ విద్యార్థిని వేధిస్తున్న లెక్చరర్‌పై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షుడు నందకిషోర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మంగళ్‌పల్లి వద్ద ఉన్న శ్రీ ఇందు ఇంజనీరింగ్ కళాశాలలో పనిచేసే ఓ లెక్చరర్ అదే కళాశాలలో బీటెక్ ఫస్టియర్ చదువుతున్న ఓ విద్యార్థిని మొబైల్‌కు అసభ్యకరమైన మెసేజ్‌లు పెడుతూ వేధిస్తున్నాడని తెలిపారు. దీనిపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను నందకిషోర్ కోరారు.

వివాహేతర బంధం వద్దనందుకు

వ్యక్తి ఆత్మహత్య



వీరబాబు(ఫైల్)

కుత్బుల్లాపూర్: ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్న వ్యక్తిని భార్య ప్రశ్నించడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంగడిపేట్ సుగుణమ్మ కాలనీకి చెందిన వీరబాబు, శాంతి భార్యాభర్తలు. శాంతి స్థానికంగా ఇళ్లలో పనిచేస్తుండగా, వీరబాబు ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. కొన్నిరోజులుగా వీరబాబు ఇంటికి ఆలస్యంగా రావడంతో పాటు డబ్బులు విపరీతంగా ఖర్చు చేస్తున్నాడు. ఈ విషయమై భర్తను నిలదీయగా వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నానని, అందుకే డబ్బులు ఖర్చు చేస్తున్న ట్లు వెల్లడించాడు. అయితే విషయం బయటపడటంతో అతడు మద్యానికి బానిసయ్యాడు. పనులకు వెళ్లకుండా అప్పులు చేయడం ప్రారంభించాడు. కాగా విజయనగరం జిల్లా పెదచామలపల్లిలో చదువుతున్న కుమారుడి సర్టిఫికెట్ కోసం ఈ నెల 15న శాంతి సొంతూరుకు వెళ్లింది. వివాహేతర సంబంధం బయటపడటంతో మనస్తాపంతో ఉన్న వీర బాబు ఈ నెల 18న మద్యం మత్తులో పురుగుల తాగాడు. ఈ విషయాన్ని గుర్తించిన చుట్టు పక్కల వారు అతడిని అంగడిపేట్‌లోని వెల్‌నెస్ ఆస్పత్రికి తీసుకువెళ్లగా పరిస్థితి విషమించడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న అతడు బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఐఐటీల్లో సీట్లు సాధించిన పేదింటి బిడ్డలు



వి.సంపత్‌కుమార్



ఎస్.రాహుల్



వి.రుషి



డి.సంతోష్‌కుమార్



టి.తరుణ్

మొయినాబాద్: ఐఐటీ మొదటి విడత కౌన్సెలింగ్‌లో చిలుకూరు గురుకులానికి చెందిన విద్యార్థులు సంచలనం సృష్టించారు. ఒకేసారి ఆరుగురు విద్యార్థులు దేశంలోని ప్రముఖ ఐఐటీల్లో సీట్లు సాధించారు. మొయినాబాద్ మండలంలోని చిలుకూరులో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ చదివి ఐఐటీ అర్హత సాధించిన విద్యార్థులు వరుసగా వి.సంపత్ కుమార్ ఐఐటీ రూర్కీ, ఎస్.రాహుల్ ఐఐటీ బాంబే, వి.రుషి ఐఐటీ ఝార్ఖండ్, డి.సంతోష్‌కుమార్ ఐఐటీ భిలాయ్, ఈ.అభిలాష్ ఐఐటీ దుర్గాపూర్, టి.తరుణ్ ఐఐటీ పట్నా ఉన్నారు. ఐఐటీల్లో సీట్లు సాధించిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు గురువారం అభినందనలు తెలిపారు.

చెంచులపై దాడి చేసిన వారిని శిక్షించాలి

చెంచు సేవాసంఘం రాష్ట్ర నాయకుడు రాములు



ఆమనగల్లు: రాష్ట్రంలో చెంచులపై దాడులకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని చెంచు సేవాసంఘం రాష్ట్ర నాయకుడు మండ్లి రాములు డిమాండ్ చేశారు. కొల్లాపూర్ నియోజకవర్గం మల్లెచింతలపల్లి భ్రమరాంభ కాలనీలో చెంచు మహిళ ఈశ్వరమ్మపై జరిగిన దాడిని ప్రతిఒక్కరూ ఖండించాలని ఆయన కోరారు. ఆమనగల్లు పట్టణంలో గురువారం రాములు విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో చెంచులపై జరుగుతున్న దాడులు, అత్యాచారాల నిరోధానికి మరిన్ని కఠిన చట్టాలు రూపొందించాలని డిమాండ్ చేశారు. చెంచు మహిళపై దాడికి పాల్పడిన వాళ్లను కఠినంగా శిక్షించాలన్నారు. చెంచుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని కోరారు. చెంచుల సమస్యలను పరిష్కరించాలని, దాడులను నిరోధించాలని పేర్కొన్నారు.

గొలుసు దొంగకు రిమాండ్

మీర్‌పేట: జల్సాలకు అలవాటు పడి చోరీలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని మీర్‌పేట పోలీసులు అరెస్ట్ చేసి కటకటాల పాలు చేశారు. ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాకు చెందిన సర్వేపల్లి వినయ్(24) నాలుగేళ్ల క్రితం బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి బీఎన్‌రెడ్డినగర్‌లో నివాసముంటూ కార్పెంటర్‌గా పని చేస్తున్నాడు. జల్సాలకు అలవాటు పడిన వినయ్ తనకు వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో గొలుసు దొంగతనాలు చేసి బంగారం అమ్మి ఎక్కువ డబ్బులు సంపాదించాలని వక్రమార్గాన్ని ఎంచుకున్నాడు. అదే క్రమంలో ఈ నెల 10వ తేదీన హస్తినాపురం విశ్వేశ్వరయ్య కాలనీకి చెందిన పద్మ మిర్యాలగూడ నుంచి తిరిగి బీఎన్‌రెడ్డినగర్‌లో బస్సు దిగి నడుచుకుంటూ వెళ్తుండగా వినయ్ ఆమె మెడలోని బంగారు గొలుసును తెంచుకుని ఉడాయించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి 14 గ్రాముల పుస్తెలతాడు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని గురువారం రిమాండ్‌కు తరలించారు.

నేరాల దర్యాప్తులో ఐటీ కీలకం

రాచకొండ కమిషనర్ తరుణ్ జోషి

సాక్షి, సిటీబ్యూరో: నేరాల దర్యాప్తులో సీసీటీవీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటీ) విభాగం పాత్ర కీలకమైందని రాచకొండ కమిషనర్ తరుణ్ జోషి అన్నారు. కమిషనరేట్ పరిధిలో నమోదైన పలు ప్రాధాన్యమైన, సంక్లిష్టమైన కేసుల విచారణలో ప్రముఖ పాత్ర పోషించిన ఈ బృందాన్ని ఆయన నగదు పురస్కారంతో అభినందించారు. ఇటీవల మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చైన్ స్నాచింగ్ కేసుతో పాటు చర్లపల్లి పరిధిలో జరిగిన ప్రాపర్టీ కేసు, భువనగిరి పరిధిలో జరిగిన చైన్ స్నాచింగ్ కేసు వంటి పలు సంక్లిష్టమైన కేసులను త్వరితగతిన ఛేదించడంలో ఐటీ సెల్ సీసీటీవీ బృందం సాంకేతికపరమైన కృషిని ఆయన ప్రశంసించారు. ఐటీ సెల్ సమర్థవంతమైన పనితీరుతో ఎన్నో కేసుల్లో అసలైన నిందితులను వీలైనంత తక్కువ సమయంలోనే పట్టుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. కమిషనరేట్ పరిధిలో జరుగుతున్న దొంగతనాలు, దోపిడీలు, రోడ్డు ప్రమాదాలు, మహిళలు, పిల్లల అపహరణ వంటి ఎన్నో కేసుల్లో బలమైన సాక్ష్యాధారాలను ప్రతి ఏరియాలో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలు అందిస్తున్నాయని వివరించారు. ఐటీ సెల్ విభాగంలోని ప్రతి ఒక్కరూ సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత మెరుగుపర్చుకోవాలని, నూతన సాంకేతిక వనరులను ఉపయోగించుకుని కేసుల దర్యాప్తు సులభతరం చేయాలని కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో ఐటీ సెల్ ఏసీపీ నరేందర్‌గౌడ్, ఇన్‌స్పెక్టర్ సుధాకర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీషీటర్ దారుణ హత్య

విజయనగర్‌కాలనీ: ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం అర్ధరాత్రి ఓ రౌడీషీటర్‌ను కొందరు వ్యక్తులు కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేశారు. ఇన్‌స్పెక్టర్ జి.వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. ఆగాపురాలో నివసించే షేక్ అలీ(34) ఫ్లవర్ డెకరేటర్ ఆసిఫ్‌నగర్ నోబుల్ టాకీస్ చౌరస్తా నుంచి లోధ్‌క్షత్రియ బయటక్ వెళ్లే దారిలో ఫీల్‌ఖానా వద్ద షేక్ అలీ మరి కొందరితో కలిసి మద్యం తాగారు. అనంతరం వారి మధ్య గొడవ జరగగా షేక్ అలీపై దుండగులు కత్తులతో దాడిచేసి పరారయ్యారు. బాధితుడు అక్కడికక్కడే రక్తపు మడుగులో పడిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు వైద్య చికిత్సల నిమిత్తం ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పాత కక్షలతో ఈ హత్య జరిగినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

- విత్తన కొనుగోలు దుకాణాల్లో టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడులు



మొయినాబాద్: ఫర్టిలైజర్ షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

చేవెళ్ల: ఫర్టిలైజర్ దుకాణదారులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విత్తనాలను విక్రయించాలని, అలాకాకుండా అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ, టాస్క్‌ఫోర్స్ అధికారులు హెచ్చరించారు. గురువారం మండలంలో టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులైన ఏడీఏ చంద్రశేఖర్, సీడ్ సర్టిఫికేషన్ ఏడీ శివకుమార్, స్పెషల్ బ్రాంచ్ ఏఎస్సై రవీందర్‌రెడ్డి పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు చేశారు. రికార్డులు, బిల్స్ పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రైతులు తాము కొన్న విత్తనాలకు సంబంధించిన రసీదులను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అదే విధంగా దుకాణదారులు తప్పనిసరిగా స్టాక్ రిజిస్టర్‌లో వివరాలను నమోదు చేయాలని సూచించారు. తనిఖీల్లో చేవెళ్ల డివిజన్ ఏడీఏ రమాదేవి, మండల వ్యవసాయధికారి తులసి తదితరులు పాల్గొన్నారు.

లూజు విత్తనాలు అమ్మితే..

మొయినాబాద్: సీడ్స్, ఫర్టిలైజర్ షాపులను జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురువారం మండల కేంద్రంలోని శ్రీబాలాజీ ఫర్టిలైజర్, శ్రీ సద్గురు సాయి ఫర్టిలైజర్, శ్రీ కిసాన్ ఫర్టిలైజర్ షాపుల్లో అధికారులు సోదాలు నిర్వహించారు. ఏయే రకాల పత్తి విత్తనాలు అమ్ముతున్నారు.. ఎంఆర్‌పీకి అమ్ముతున్నారా లేదా అనే విషయాలను తెలుసుకున్నారు. స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డీలర్లు విత్తనాలను ప్యాకింగ్ లేకుండా లూజుగా విక్రయించవద్దన్నారు. ఎంఆర్‌పీకి మించి అధిక ధరలకు విత్తనాలు, ఎరువులను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొనుగోలు చేసే రైతులకు బిల్లులు తప్పని సరిగా ఇవ్వాలని సూచించారు. వారి వెంట మండల వ్యవసాయాధికారి రాగమ్మ తదితరులు ఉన్నారు.

షాబాద్‌లో ఫర్టిలైజర్ దుకాణాల్లో సోదాలు

షాబాద్: ఫర్టిలైజర్ దుకాణాల్లో నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని సహాయ వ్యవసాయ సంచాలకుడు (ఏడీఏ) చంద్రశేఖర్, సీడ్ సర్టిఫికేషన్ ఏడీ శివకుమార్ హెచ్చరించారు. గురువారం మండల పరిధిలోని నాగర్‌గూడలోని విత్తనాల డీలర్ షాపులను జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు తనిఖీ చేశారు.